సాక్షి
నారాయణపేట
శనివారం । 9 । మార్చి । 2024

గరిష్ఠం/కనిష్ఠం
39.6 /20.2

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.



మహాకుంభాభిషేకం.. శివజ్యోతి దర్శనం..

మహాశివరాత్రిని పురస్కరించుకొని అలంపూర్‌లోని బాలబ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయాల్లో మహాకుంభాభిషేకం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి లింగోద్భవన కాలం వరకు అభిషేకాలు చేశారు. అర్ధరాత్రి తర్వాత శివజ్యోతి(ఆకాశజ్యోతి)ని నింగిలోకి వదిలారు. – అలంపూర్/ జోగుళాంబ శక్తిపీఠం

– వివరాలు 8, 10లో..



భౌరాపూర్‌లో ఆదిదంపతుల కల్యాణోత్సవం

నల్లమల లోతట్టు అటవీ ప్రాంతంలోని భౌరాపూర్ భ్రమరాంబిక, మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని చెంచులు అత్యంత వైభవంగా నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినాన భౌరమ్మను తమ ఆడబిడ్డగా, మల్లికార్జునస్వామిని అల్లుడిగా భావించి కల్యాణం జరిపించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. – అచ్చంపేట/ మన్ననూర్

న్యూస్‌రీల్

రేపు ఎస్టీ గురుకుల సీఓఈ సెట్ పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్ ఎస్టీ గురుకులాల్లో ప్రవేశానికి సంబంధించిన సీఓఈ సెట్ ఆదివారం నిర్వహిస్తున్నట్లు తిరుమల గురుకులాల ప్రిన్సిపాల్ సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తిరుమల హిల్స్ సెంటర్‌లోనే పరీక్ష నిర్వహిస్తామని, పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్‌లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని, డౌన్‌లోడ్ చేసుకోవాలని, మరింత సమాచారం కోసం 79010 97704 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

యూత్ పార్లమెంట్‌కు ఎన్టీఆర్ కళాశాల విద్యార్థిని



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కేంద్ర యువజన క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే యూత్ పార్లమెంట్ ఫెస్టివల్–2024కు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని భవాని శెట్టి పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 87 మంది విద్యార్థులు పాల్గొనగా తెలంగాణ నుంచి ముగ్గురికి అవకాశం దక్కింది. అందులో భవాని శెట్టి ఒకరు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీల్లో 'భారత్ విశ్వగురుగా మార్చడం ఎలా' అనే అంశంపై ప్రసంగించి యూత్ పార్లమెంట్‌కు ఎంపికయ్యారు. పార్లమెంట్‌లో స్పీకర్ ఓంబిర్ల ఎదుట సెంట్రల్ హాల్‌లో ప్రసంగించి, ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా భవానిని కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ అభినందించారు.

శ్రామిక మహిళ పోరాట దినంగా పాటించాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని శ్రామిక మహిళ పోరాట దినంగా పాటించాలని చైతన్య మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక స్టేట్‌హోంలో శ్రామిక మహిళ పోరాట దినంగా పాటిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలకి జీవనోపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయన్నారు. మళ్లి పని గంటల పెంచి వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని ఆరోపించారు. యువత ప్రేమ పేరుతో మోసపోతున్నారని, దానినుంచి బయటపడాలన్నారు.కార్యక్రమంలో చైతన్య మహిళ సంఘం నాయకురాళ్లు నవ్య, లక్ష్మీ, శ్రీదేవి, కస్తూరి డీటీఎఫ్ నాయకురాలు సృజన, నర్మద పాల్గొన్నారు.



మక్తల్‌లోని మల్లికార్జునస్వామి ఆలయం వద్ద భక్తుల క్యూ..

హరహర మహాదేవ..

- మార్మోగిన శివనామస్మరణ
- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి
- ఉపవాస దీక్షలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు
- కిటకిటలాడిన శైవ క్షేత్రాలు



అభిషేకం చేస్తున్న భక్తులు

నారాయణపేట/కోస్గి: మహాశివరాత్రి పర్వదినాన్ని పరస్కరించుకొని శుక్రవారం శైవ క్షేత్రాల్లో భక్తులు 'హరహర మహాదేవ..శంభో శంకర' అంటూ ముక్కంటి దర్శనం కోసం బారులు తీరగా ఆలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. మహాశివరాత్రి నేపథ్యంలో శివాలయాల్లో అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు సాయంత్రం ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేసి ఫలహారాలు స్వీకరించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు లింగమయ్యకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. శివునికి ప్రీతిపాత్రమైన బిల్వ దళ పత్రాలు, మారెడు పూలతో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని పురాతనమైన భారంబావి శివలయం, లింగయ్య గుడిలో భక్తులు బారులు తీరి దర్శించుకొని పూజలు చేశారు. శివరాత్రి జాగరణను పురష్కరించుకొని భక్తి,భజనలకు ఆలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారిని దర్శించుకొని భక్తులు పులకించుపోయారు.

ఆలయాల్లో రుద్రాభిషేకం...

మహాశివరాత్రి సందర్భంగా కోస్గి ముక్తిపాడ్ గ్రామ పరిధిలోని పార్వతీశ్వరాలయం, పట్టణ శివారులోని తిమ్మన బావి శివాంజనేయ స్వామి ఆలయంలో రుద్రాక్షాల మఠం పురోహితులు అమరలింగ స్వామి, శ్రీలక్ష్మీ వెంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాల ప్రాంగాణంలోని ఇంద్రనీలేశ్వరాలయంలో అంపయ్య స్వామి ఆధ్వర్యంలో రుద్రాభిషేకంతోపాటు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మాలధారణ చేసిన శివస్వాములు గురు స్వాములతో కలిసి పాలు, నెయ్యి, తేనే, పెరుగు, చక్కెర కలిపిన పంచామృతంతో మహారుద్రాభిషేకం, మహామంగళ హారతితో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయానికి వచ్చిన భక్తులకు ఉచితంగా పలు రకాల పండ్లను అల్పాహారంగా అందజేశారు. ఇదే క్రమంలో పట్టణంలోని బ్రహ్మన వీధి ఆలయం, నీలకంఠ స్వామి ఆలయం, బసవమఠం మల్లికార్జున స్వామి ఆలయం, శంభుని గుడి, పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న శివలింగానికి భక్తులు పూజలు చేయగా మండల పరిధిలోని శైవ క్షేత్రాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

చల్లాకే కాంగ్రెస్ టికెట్

మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి ఖరారు

- వంశీచంద్‌రెడ్డికే కేటాయిస్తూ హైకమాండ్ నిర్ణయం
- నాగర్‌కర్నూల్‌లో తేలని అభ్యర్థిత్వం



సాక్షి, నాగర్‌కర్నూల్: మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థిగా చల్లా వంశీచంద్‌రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం శుక్రవారం ప్రకటించింది. ఇటీవల కోస్గిలో నిర్వహించిన సభలోనే వంశీచంద్‌రెడ్డి పేరును సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో చల్లా చేపట్టిన 'పాలమూరు న్యాయ యాత్ర' ముగింపు సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో నిర్వహించిన 'పాలమూరు ప్రజాదీవెన' బహిరంగసభ ద్వారా కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది.

నాగర్‌కర్నూల్‌పై వీడని సస్పెన్స్

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ నుంచి బరిలో ఉండేందుకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పోటీ పడుతున్నారు. వీరితోపాటు మాజీ ఎంపీ మందా జగన్నాథం సైతం ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. అయితే వీరిలో మల్లురవికే టికెట్ ఖరారు అయినట్టు చర్చ సాగుతోంది. ఇప్పటికే నాగర్‌కర్నూల్ స్థానంలో బీజేపీ తమ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ రాములు తనయుడు భరత్ ప్రసాద్‌ను ప్రకటించింది. బీఆర్‌ఎస్ సైతం పొత్తులో భాగంగా ఈ సీటును బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు కేటాయించనున్నట్లు ఇటీవల సంకేతాలిచ్చింది. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని నాలుగు పార్లమెంట్ స్థానాల్లో తమ అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో అభ్యర్థిగా చల్లా వంశీచంద్‌రెడ్డిని ప్రకటించినా.. నాగర్‌కర్నూల్ అభ్యర్థిని ప్రకటించలేదు. దీంతో పార్టీ అధిష్టానం ఎవరికి తమ అభ్యర్థిగా ఎంపిక చేయనుందన్న దానిపై శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. మరోవైపు మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి ఎవరన్న దానిపై ఇంకా సందిగ్ధం వీడలేదు. ఇక్కడి నుంచి బరిలో ఉండేందుకు ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డితోపాటు పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ పోటీపడుతున్నారు. వీరు ఎవరికి వారు టికెట్ కోసం పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో పార్టీ అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ప్రొఫైల్

పేరు: చల్లా వంశీచంద్‌రెడ్డి
పుట్టిన తేదీ: 4.5.1980
విద్యార్హత: ఎంబీబీఎస్
తండ్రి: చల్లా రాంరెడ్డి, **తల్లి:** శోభ
సతీమణి: అక్లేషరెడ్డి
సంతానం: మహాక్ష, కృష్ణదేవ్
స్వగ్రామం: శేరిఅప్పారెడ్డిపల్లి గ్రామం, చారకొండ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా
రాజకీయ అనుభవం: ప్రస్తుతం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా, ఏఐసీసీ కార్యదర్శిగా ఉన్నారు. 2014లో కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు.
రాజకీయ అరంగేట్రం: 2002లో కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం ఎన్‌ఎస్‌యూఐ గాంధీ మెడికల్ కళాశాల అధ్యక్షుడిగా నియామకం. 2004లో ఎన్‌ఎస్‌యూఐ యూనివర్సిటీ ఇన్‌చార్జ్‌గా నియామకం, తర్వాత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపిక. 2012 నుంచి 2015 వరకు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు.

సీఎం రేవంత్ పర్యటనతో జోష్..

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ మిగతా పార్టీల కన్నా దూకుడు ప్రదర్శిస్తోంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో రెండుసార్లు పర్యటించారు. మహబూబ్‌నగర్ వేదికగా పాలమూరు ప్రజాదీవెన సభతో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శంఖారావం పూరించారు. మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థిని సైతం ముందుగానే ఖరారు చేసి కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో దూకుడు ప్రదర్శిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడం, మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి ఆయనే ఇన్‌చార్జ్‌గా ఉండటంతో ఈ జిల్లాలో పట్టు కోసం కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.

అవకతవకలకు అడ్డుకట్ట!

ఉపాధి కూలీకి తప్పనిసరి ఆధార్ అనుసంధానం

- కూలి చెల్లింపుల్లో అక్రమాల నివారణకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం
- ఆన్‌లైన్‌లో వివరాలు నమోదైన వారికే వేతనం
- త్వరలో ముఖ ఆధారిత హాజరు నమోదు

నర్వ: జాతీయ ఉపాధిహామీ పథకం పనుల్లో అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్రప్రభుత్వం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. పనికి వచ్చే కూలీల హాజరు విషయంలో పకడ్బందీగా వ్యవహరించాలని నిర్ణయించింది. ప్రతి కూలీ ముఖచిత్రం గుర్తింపు హాజరు విధానాన్ని అమలు చేయడానికి కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఎన్ఎంఎంఎస్(నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. రాష్ట్రంలో కొన్ని పంచాయతీల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసి పరిశీలిస్తున్నారు. అందులో లోపాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు. ఆ అనుభవాలను రాబోయే ఆర్థిక సంవత్సరం నుంచి అన్ని జిల్లాల్లో అమలు చేయడానికి కసరత్తు చేస్తోంది.

ఆధార్ అనుసంధానం..
ఉపాధిహామీ పథకంలో కూలీల జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను జిల్లాలో ముమ్మరంగా చేపట్టారు. ప్రతి మండలంలో వంద శాతం పూర్తి చేసేలా గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు వేగవంతం చేసింది. జిల్లాలో ఇది వరకే 100 శాతం నమోదు పూర్తి అయినట్లు అధికారులు పేర్కొన్నారు. గత ఏడాది సెప్టెంబర్ నుండి ప్రతి కూలీకి ఆధార్ అనుసంధాన వేతనం అమలయ్యేలా చర్యలు తీసుకోగా ఈ గడువును డిసెంబర్ నెల వరకు కేంద్రం పొడిగించింది. దీంతో ఉపాధి కూలీలకు కాస్త ఊరట లభించింది. గత కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా కూలీల బ్యాంకు ఖాతాలను ఆధార్‌కు అనుసంధానం చేసే ప్రక్రియను ముమ్మరంగా చేపట్టారు. గడువు పొడగింపుతో కూలీల ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో ఇప్పటికే 100 శాతంకు చేరువలో చేపట్టారు.

మండలాల వారీగా ఆధార్ నమోదు ఇలా..

మండలం	ఉ.కూ.	ఆ.అ.అ.వా.
దామరగిద్ద	13358	13345
దన్వాడ	8925	8920
కోస్గి	10661	9985
క్రిష్ణ	4549	4549
మద్దూర్	17171	17133
మాగనూర్	7809	7809
మక్తల్	18726	18720
మరికల్	7871	7871
నారాయణపేట	16657	16657
నర్వ	8440	8440
ఊట్కూర్	16319	16315
మొత్తం	1,30,486	1,30,409

ఉ.కూ.: ఉపాధి కూలీలు, ఆ.అ.అ.వా.: ఆధార్ అప్‌డేట్ అయిన వారు

కూలీల నమోదుకు సాంకేతికత
ఇప్పటి వరకు 20మందికి పైగా కూలీలు పనిచేస్తే.. సిబ్బంది ఆ ప్రాంతానికే వెళ్లి కూలీల వివరాలను నమోదు చేసి వారి ఫోటోలను, హాజరును ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేసే వారు. ఒకరి బదులు మరొకరు పనులకు హాజరవ్వడం, కొన్ని చోట్ల పనిచేసిన వారి పేర్లను నమోదు చేయకపోవడం, కూలీల సంఖ్య పెంచి రాయడాన్ని ఉన్నతాధికారులు గమనించారు. ప్రతి ఏటా సోషల్‌ఆడిట్(సామాజిక తనిఖీ)లో కనిపించే ఇలాంటి తేడాలను వంద శాతం తగ్గించేందుకు కూలీల వివరాలను నమోదు చేయడమే పరిష్కారమని నిపుణులు సూచించారు.



నర్వ మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

జిల్లాలో ఇలా..

మొత్తం జాబ్‌కార్డులు	కూలీల సంఖ్య
1,034,90	2,15,000

పారదర్శకత కోసమే..

పల్లెల్లో అనేక చోట్ల పోస్టల్ డిపార్ట్‌మెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌లు కూలీల వేతనాలను స్వాహా చేసినట్లు అనేక ఆరోపణలున్నాయి. వీటిని అరికట్టేందుకు బ్యాంకు, పోస్టల్ డిపార్టుమెంట్ నుంచి నేరుగా కూలీలు వేతనాలు పొందేందుకు ఆధార్ అనుసంధానం చేస్తున్నారు. పోస్టల్ డిపార్టుమెంటు ద్వారా 47,874 మంది, బ్యాంకుల ద్వారా 82, 424 మంది కూలీలు ఖాతాలు కలిగి ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. అదే విదంగా జాతీయ స్థాయిలో నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విధానంలో బాగంగా ఆధార్ బ్రిడ్జి పేమెంట్ సిస్టమ్(ఏబీపీఎస్)ను అమలు చేస్తున్నారు. కూలీల ఖాతాలకు అనుసంధానం విషయంలో ఇప్పటి వరకు 5 సార్లు గడువు పొడిగించడంతో అధికారులు ఎట్టకేలకు పూర్తి స్థాయిలో వంద శాతం ఆధార్ అనుసంధానం చేపట్టేలా కృషి చేస్తున్నారు.

ఫొటోలతో సహా నమోదు

ఈ ఏడాది జనవరి ఒకటి నుండి ఉపాధిహామీ పథకం క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులు పనుల వద్దకు వెళ్లి కూలీల హాజరును ఫొటోలతో నమోదు చేసి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉంది. ఉదయం, మధ్యాహ్నం కూలీల హాజరును క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫొటోలతో సహా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. దీంతో నిజంగా పనులు చేసిన కూలీల వివరాలే నమోదై వారికి వేతనం అందుతుంది. ఆర్థికపరమైన అవకతవకలను కూడా నివారించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో సిబ్బంది చొరవ

కూలీలకు పారదర్శకంగా వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఖాతాలకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ వేగవంతం చేశాం. కూలీల నమోదు ప్రక్రియలో భాగంగా పనుల ఫొటోలను నమోదు చేయడంపై సిబ్బందికి అవగాహన కల్పించాం. ఉదయం, మధ్యాహ్నం హాజరు నమోదు తప్పనిసరి చేయాలని ఆదేశించాం. క్షేత్రస్థాయిలో స్పందించి సమాచారం అందించేలా సిబ్బందిని సమాయత్తం చేశాం. – రాజేశ్వరి, డీఆర్డీఓ

ప్రజలకు భద్రత కల్పించడానికే ఫ్లాగ్‌మార్చ్



మద్దూరులో కేంద్ర సాయుధ బలగాల కవాతు

మద్దూరు: ప్రజలకు భద్రత, భరోసా కల్పించడానికే కేంద్ర సాయుద బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరుగుతుందని ఏఎస్పీ నాగేంద్రుడు తెలిపారు. శుక్రవారం మద్దూరు, దోరేపల్లి గ్రామాల్లో జిల్లా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రజల్లో అత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు, ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల్లో పాల్గొనేందుకు ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటారని గుర్తుచేశారు. ఈ గ్రామాల్లో ప్రధాన వీధుల గుండా కేంద్ర బలగాల కవాతు కొనసాగింది. కార్యక్రమంలో కోస్గి సీఐ సోమనర్సయ్య, కేంద్ర సాయుధ బలగాల సీఐ భూపాల్‌సింగ్, ఎస్‌ఐ రాంలాల్, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో పోలీస్ చేక్‌పోస్టు ఏర్పాటు
కృష్ణా: మండల సరిహద్దులోని చేగుంట శివారులో శుక్రవారం పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఎస్‌ఐ నవీద్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కర్ణాటక నుంచి మన రాష్ట్రంలోకి మద్యం, డబ్బు, మత్తు పదర్థాలు రాకుండా ప్రతి వాహనంను తనిఖీ చేయడం జరుగుతుందని అన్నారు. అదే విదంగా ప్రజలు ఈ విషయంపై అవగాహనతో ఉండాలని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంతరాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.



చేగుంట శివారులోని పోలీస్ చెక్‌పోస్టు

జడ్చర్లలో ముసలం

పురపాలిక చైర్‌పర్సన్‌పై అసంతృప్తి

- రాజీనామా చేయించాలని మాజీ ఎమ్మెల్యేతో కౌన్సిలర్ల మొర
- ఇతర పార్టీ నేతలను చేర్చుకోమంటున్న ఎమ్మెల్యే అనిరుధ్
- సందిగ్ధంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

జడ్చర్ల: స్థానిక మున్సిపాలిటీ పాలకమండలిలో ముసలం ఏర్పడింది. మొదటి నుంచి చైర్‌పర్సన్ లక్ష్మిపై ఉన్న అసంతృప్తి ముదిరి పాకాన పడింది. అవిశ్వాసం గడువు దగ్గర పడుతున్న వేళ కౌన్సిలర్లు తమ స్వరం పెంచారు. ఇప్పటికే పలుమార్లు వైఖరిని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయనే కౌన్సిలర్లకు నయాన భయాన నచ్చజెప్పుతూ అన్నీ తానై నెట్టుకొస్తున్నారు. చైర్‌పర్సన్ కూడా అంతా పెద్దాయనే చూసుకుంటారంటూ కౌన్సిలర్లను పెద్దగా పట్టించుకున్న దాఖలాలు లేవు. చైర్‌పర్సన్‌పై అవినీతి ఆరోపణలు వచ్చిన సమయంలో కూడా మాజీ ఎమ్మెల్యే వాటిని తిప్పికొట్టించారు. ఇలాంటి నేపథ్యంలో చైర్‌పర్సన్ భర్త రవీందర్ వైఖరిలో ఎలాంటి మార్పురాకపోవడం, కౌన్సిలర్లను పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వచ్చాయి. దీంతో కౌన్సిలర్లు ఇటీవల మరోసారి హైదరాబాద్‌లో లక్ష్మారెడ్డిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. చైర్‌పర్సన్ భర్తను నమ్మి పెద్ద మొత్తంలో రియల్, ఇతర పెట్టుబడులు పెట్టామని, తీరా ఆయన మాత్రం లాభాలు గడించి తమ చేతికి చిప్ప ఇచ్చారని ఓ కౌన్సిలర్ వాపోయారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ఆయనదే హవా కొనసాగిందని, దీంతో తాము ప్రేక్షకపాత్ర పోషించాల్సి వచ్చిందని కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే వద్ద గోడు వెళ్లబోసుకున్నారు.

మారుద్దామా..?
మున్సిపల్ చైర్‌పర్సన్‌ను మార్చేందుకు మాజీ ఎమ్మెల్యే తలొగ్గినట్లు విశ్వసనీయ సమాచారం. చైర్‌పర్సన్‌గా ఎన్నికైన నాటి నుంచే సొంత పార్టీకి చెందిన పలువురు కౌన్సిలర్లు అసంతృప్తితో ఉన్నారు. అయితే అవిశ్వాసం పెట్టి తొలగించి పార్టీకి అప్రతిష్ఠ తేకుండా స్వయంగా రాజీనామా చేయించి బీఆర్‌ఎస్‌కు చెందిన మరో మహిళా కౌన్సిలర్‌ను చైర్‌పర్సన్‌గా ఎన్నుకునేందుకు వీలుగా తామంతా కట్టుబడి ఉంటామని కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యేకు వివరించినట్లు సమాచారం.

కాంగ్రెస్ టచ్‌లోకి కౌన్సిలర్లు
పలువురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ టచ్‌లోకి వెళ్లారు. అయితే స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తమ పార్టీలోకి ఇతర పార్టీల వారిని చేర్చుకోమని స్పష్టం చేయడంతో పలువురు కౌన్సిలర్లు సందిగ్ధంలో పడ్డారు. తాజాగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు కలిసి వచ్చింది. తమ ఓట్లు కావాలంటే కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించాల్సిందేనని వారు పేర్కొంటున్నారు.

రాజీనామా ఎందుకు చేయాలి..
తాను ఎందుకు రాజీనామా చేయాలో చెప్పాలని చైర్‌పర్సన్ లక్ష్మి ఈ సందర్భంగా ప్రశ్నించారు. అదే పరిస్థితి ఎదురైతే తనతో పాటు తనను వ్యతిరేకిస్తున్న కౌన్సిలర్లు కూడా రాజీనామా చేసి అందరం మళ్లీ పోటీ చేద్దామని తెలిపారు.

దక్షిణకాశీలో మహా కుంభాభిషేకం

అలంపూర్‌లో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

- ఆగమయుక్తంగా నిర్వహించిన అర్చకులు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. కిక్కిరిసిన ఆలయాల ఆవరణ
- వేర్వేరు సమయాల్లో హాజరైన ప్రముఖులు



మహాకుంభాభిషేకం పూజల్లో ఎమ్మెల్యే విజయుడు



అలంపూర్‌లోని తుంగభద్ర నది పుష్కర ఘాట్ వద్ద శివరాత్రి జాగరణకు హాజరైన భక్తులు

అలంపూర్/జోగుళాంబ శక్తిపీఠం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరంచుకొని దశాబ్దాల కాలం తర్వాత దక్షిణకాశీ అలంపూర్ క్షేత్రంలో శుక్రవారం మహా కుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. అష్టబంధనం, ద్రవ్యకాటిన్యం పుష్కరకాలమే ఉంటుందని.. ఆ తర్వాత స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు దివ్యతేజోశక్తిని ఆవాహనం చేయాలని తద్వార దైవికశక్తి ద్విగిణీకృతం అవుతుందని ఆగమ వచనం. ఇందుకోసం ప్రతి 12 ఏళ్లకు ఓసారి గర్భాలయంలో అవసరమైన మరమ్మతులు, పీఠానికి అష్టబంధనం వంటి కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. మహాకుంభాభిషేకాన్ని ఆగమయుక్తంగా పంచానిక దీక్షతో నిర్వహించినట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. కుంభాభిషేకానికి ఐదురోజుల ముందు కళాపకర్షన చేసినట్లుగానే కుంభాభిషేకంరోజు తెల్లవారుజామున కళాన్యాసం నిర్వహించి మరింత దైవికశక్తిని అందజేశారు. అనంతరం బింబదర్శనం, గోదర్శనంతో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించి యాగరక్షణ దేవతమూర్తుల విగ్రహానికి అందజేశారు. ఉభయ ఆలయాల శిఖరాలపై ఆగమోక్త ప్రకారం మహాకుంభాభిషేకం, పుష్పాభిషేకం, పూర్ణాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ బీఎం సంతోష్, జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి కమలాపురం కవిత, ఎమ్మెల్యే విజయుడు వేర్వేరు సమయాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొనడం తమ పుర్వజన్మ సుకృతమని.. కార్యక్రమాలు నిర్వహించిన ఆలయ అధికారి పురేందర్‌కుమార్‌ను అభినందించారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు..

అలంపూర్ చౌరస్తా నుంచి ఆలయం వరకు వాహనాలు బారులు తీరాయి. రైళ్లలో వచ్చిన భక్తులతో జోగుళాంబ రైల్వేస్టేషన్ వద్ద కోలాహలం కనిపించింది. పోలీసులు క్షేత్ర ముఖద్వారం నుంచే ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేశారు. జూనియర్ సివిల్‌కోర్టు వద్ద వాహనాలు లోపలికి రాకుండా పోలీసులు కట్టడి చేశారు. కోర్టు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఫోర్ వీలర్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో టూవీలర్ పార్కింగ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి భక్తులు కాలినడకన ఆలయాలకు చేరుకున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ స్థలం నుంచి ఆలయాల వరకు ప్రత్యేకంగా ప్రైవేటు వాహనాలు అనుమతించారు. స్థానికుల వాహనాలు సైతం అక్కడే నిలిపివేయడంతో కొంత ఇబ్బందులు పడ్డారు.

169 మంది సిబ్బందితో భద్రత..

డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రవిబాబు, ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. బందోబస్తులో 10 మంది ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు ముగ్గురు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు 26 మంది, కానిస్టేబుళ్లు 47 మంది, బెటాలియన్ పోలీసులు 52 మంది, మహిళా పోలీసులు 16 మంది, హోంగార్డులు 15 మొత్తం 169 మంది పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు పర్యవేక్షించనున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

జనసంద్రంగా బాలబ్రహ్మేశ్వరుడి క్షేత్రం..

పండుగను పురస్కరించుకొని భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనానికి భక్తులు క్యూలైన్లలో గంటల తరబడి బారులు తీరడం కనిపించింది. ఈఓ పురేందర్ కుమార్, చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈసారి పుష్కరఘాట్‌లో 14 అడుగుల ఎత్తైన శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. భక్తులకు దేవస్థానం వారు ఉచితంగా 15 వేల మజ్జిగ ప్యాకెట్లు, 20 వేల వాటర్ బాటిళ్లను అందజేశారు. వీటితోపాటు ఆర్యవైశ్య సంఘం, వివేకానంద యువజన సంఘంతో పాటు పలువురు దాతలు అల్పాహారం, పండ్లు, మంచినీటిని పంపిణీ చేశారు. బైరోజు రాజశేఖర్ భక్తులకు సూచనలు, ఆలయంలో జరుగుతున్న పూజా విధానాలను మైక్‌లో వివరించారు. క్యాతూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటుచేసి ఉచితంగా మందులు అందజేశారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొని పర్యవేక్షించారు.

ప్రత్యేక పూజలు..

ఉత్సవాల సందర్భంగా బాలబ్రహ్మేశ్వరుడి క్షేత్రంలో రుద్రహోమ పూజలు జరిగాయి. ప్రత్యేక పూజా మందిరంలో ఆవాహిత దేవత హోమాలు, మరోవైపు గణపతి యంత్రం, ఏకతోలింగభద్ర మండపారాధన, వాస్తు, యోగిని క్షేత్రపాలక మండపారాధన, శ్రీయంత్రం, నవగ్రహ మండపారాధన, సర్వతో భద్రమండలి, చతుర్లింగతోభద్ర మండలి తదితర పూజలు చేశారు. ఆలయం చుట్టు దిక్పాలకులకు మంగళవాయిద్యాలతో ఉత్సవ బలిబేరంతో బలిహరణం నిర్వహించారు. జోగుళాంబ ఆలయంలో శ్రీ చక్రార్చనలు జరిగాయి. పరివార దేవతా మందిరాల్లో దేవతామూర్తులకు భక్తులు స్వతహాగా అభిషేకాలు చేస్తూ దీపాలు వెలిగించారు. 24 ఆలయాల సముదాయమైన పాపనాశేశ్వర ఆలయం, సంఘమేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 9 నుంచి యమకాల పూజలు జరిగాయి. లింగోద్భవ కాలంలో శివస్వాములకు శివజ్యోతి దర్శన భాగ్యం కలిగింది.



అమ్మవారి ఆలయం వద్ద భక్తులు



అలంపూర్ ఆలయాల ఆవరణలో భక్తులు

సంగమేశ్వరుడిని దర్శించుకోవడానికి బోటులో వెళ్తున్న భక్తులు



సోమశిలలో భక్తుల కిటకిట

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిలలో సోమేశ్వరాలయానికి భక్తులు తరలివచ్చారు. గ్రామ సమీపంలోని కృష్ణానది బ్యాక్ వాటర్‌లో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి బోటులో నది అవతలి ఒడ్డున ఉన్న సంగమేశ్వరాలయానికి చేరుకొని స్వామి వారిని దర్శించున్నారు. సోమశిల, సంగమేశ్వరం గ్రామాల మత్స్యకారులు భక్తుల సౌకర్యార్థం బోట్లను ఏర్పాటు చేశారు. అనంతరం సోమశిలలో వెలసిన లలితా సోమేశ్వరాలయానికి చేరుకొని సోమేశ్వరుడు, ద్వాదశ జ్యోతిర్లింగాలు, లలితాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ, కొల్లాపూర్ ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో అన్నదానం, అల్పాహారం ఏర్పాటు చేశారు.

వైభవంగా కల్యాణోత్సవం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి దంపతులు

- చెంచుల సంప్రదాయ పద్ధతిలో భౌరాపూర్ భ్రమరాంబిక, మల్లిఖార్జునస్వామి కల్యాణం

అచ్చంపేట/ మన్ననూర్: నల్లమల లోతట్టు అటవీ ప్రాంతంలోని భౌరాపూర్ భ్రమరాంబిక, మల్లికార్జునస్వామి కల్యాణోత్సవాన్ని చెంచులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏటా మహా శివరాత్రి పర్వదినాన భౌరమ్మను తమ ఆడబిడ్డగా, మల్లికార్జునస్వామిని అల్లుడిగా భావించి చెంచులు స్వామివారికి కల్యాణం జరిపిస్తారు. లింగాల మండలం భౌరాపూర్ చెంచుపెంటలోని భ్రమరాంబిక ఆలయంలో శుక్రవారం నిర్వహించిన కల్యాణోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి చెంచులు తరలివచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏ ఆధ్వర్యంలో అధికారికంగా వేడుకలు నిర్వహిస్తోంది. కల్యాణోత్సవంలో భాగంగా చెంచులు తమ సంప్రదాయ నృత్యాలతో భౌరమ్మ, మల్లికార్జున స్వామివార్లకు ఎదుర్కోళ్లు నిర్వహించారు. దేవతా మూర్తుల విగ్రహాలను కొప్పెరలో ఉంచి తప్పట్ల చప్పుళ్లతో ఆలయ సన్నిధికి తీసుకొచ్చారు. చెంచు పూజారి మల్లయ్య కల్యాణం జరిపించారు. అమ్మవారి తరపున పెళ్లి పెద్దలుగా ఎమ్మెల్యే వంశీకృష్ణ, అనురాధ దంపతులు వ్యవహరించగా, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, అశ్లేష దంపతులు స్వామివారి తరుపున పెళ్లి పెద్దలుగా వ్యవహరించి అన్నిరకాల కార్యక్రమాలను నిర్వహించారు.

సమస్యలు పరిష్కరిస్తాం..

చెంచుజాతి అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ వంశీకృష్ణ అన్నారు. వచ్చే మహాశివరాత్రి నాటికి అప్పాపూర్, భౌరాపూర్ ఆలయ ప్రాంగణంలో చెంచుల విశ్రాంతి కోసం షెడ్ల నిర్మాణం, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. చెంచుల సమస్య పరిష్కారం కోసం మహాసభలు భౌరాపూర్ ఆలయ ప్రాంగణంలో నిర్వహించేలా చూస్తామన్నారు. కృష్ణానదిలో చేపలు పట్టుకునే విషయంలో ఏపీ మత్స్యకారులకు, చెంచుల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. భౌరాపూర్ చెరువు పూడికతీత పనులు, ఆలయం పక్కన ఉన్న కోనేరు పునరుద్ధరణ పనులు చేపడతామన్నారు. చెంచుల హక్కులు కాపాడి వారికి పూర్తిగా అండగా ఉంటామని, చెంచుల న్యాయమైన కోరికలు తీరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీడీఓ కమలాకర్ రెడ్డి, ఐటీడీఏ అధికారి జాఫర్ ఉస్సేన్, జీసీసీ మేనేజర్ సంతోష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ హేమలత, చెంచు నాయకులు గురువయ్య, మల్లికార్జున్, శంకరయ్య, చీరరాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



భౌరాపూర్‌లో ఉత్సవాలకు హాజరైన చెంచులు

పకడ్బందీగా ఏర్పాట్లు

భౌరాపూర్ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. నల్లమల అడవిలో తరుచుగా సంభవిస్తున్న అగ్నిప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఫైరింజన్ వాహనాలను అందుబాటులో ఉంచారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐలు రవీందర్, శంకర్‌నాయక్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి చెంచులకు ఆధార్ నమోదు చేశారు. జీసీసీ, ఆర్టీటీ, వైద్య, ఆరోగ్య, స్త్రీశిశు సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి, ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు సంబంధించిన స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు భోజన, తాగు నీటి వసతి కల్పించారు. ఐటీడీఏ అధికారులు 14 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడిపించారు.

సూక్ష్మకళతో శివలింగాలు



సూక్ష్మకళకు పెట్టింది పేరైన శేఖరాచారి శివరాత్రి సందర్భంగా మరోసారి తనలోని ప్రతిభకు పదును పెట్టారు. శుక్రవారం 50 మిల్లీ గ్రాముల బంగారాన్ని వినియోగించి శివలింగం, త్రిశూలం రూపొందించారు. ఈ సందర్భంగా సూక్ష్మకళా కారుడు శేఖరాచారి పలువురు అభినందించారు.

– కల్వకుర్తి రూరల్

నీలకంఠాయ.. నమో నమః

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు

- నల్లమలలో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- ఉపవాస దీక్షలతో భక్తుల ప్రత్యేక పూజలు



ఉమామహేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



ఉమామహేశ్వరంలో భక్తుల రద్దీ

అచ్చంపేట: మహాశివరాత్రిని పురస్కరించుకొని నల్లమలలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. పరమశివుని అనుగ్రహం కోసం భక్తులు ఉపవాస దీక్షలుభూని ప్రత్యేక పూజలు, జాగరణ చేపట్టారు. శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రం, మల్లెలతీర్థం, అమ్రాబాద్ అటవీ ప్రాంతంలోని అంతరగంగ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మన్ననూర్ లింగమయ్య, దోమలపెంట ఉమామహేశ్వర ఆలయం, లొద్దిమల్లయ్యలో పూజలు చేశారు. శ్రీశైలం వెళ్లే భక్తులు ముందుగా ఉమామహేశ్వరుడిని దర్శించుకుని అటు నుంచి ప్రకృతి రమణీయమైన మల్లెలతీర్థం చేరుకుని, అటు నుంచి శ్రీశైలం మల్లన్న సన్నిధికి తరలివెళ్లారు. ఉమమహేశ్వరంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచందర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకం, అర్చనలు నిర్వహించారు.

వైద్య శిబిరాల ఏర్పాటు

శ్రీశైలం వెళ్లే శివస్వాములు, భక్తులకు వైద్యసేవలు అందించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అధికారులు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. శ్రీశైలం జాతీయ రహదారిపై మన్ననూర్, వటువర్లపల్లి, దోమలపెంట, ఈగలపెంటలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పాతాళగంగ వద్ద 24 గంటల పాటు వైద్యులను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను తరలించేందుకు రెండు అంబులెన్సులు ఏర్పాటు చేశారు.

ఉమామహేశ్వరుడికి అభిషేకాలు

ఉమామహేశ్వర క్షేత్రంలో ప్రజలు బారులుతీరారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చొని స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులు పాపనాశిని గుండం వద్ద సాన్నాలు ఆచరించి ఉమాదేవి, ఉమామహేశ్వరులకు పాలాభిషేకం, పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. క్షేత్రంలో అర్చకులు వీరయ్యశాస్త్రి వేద మంత్రోచ్ఛరణ మధ్య భక్తులు పూజలు జరిపారు. ఉమామహేశ్వరం కొండపై స్థలాభావంతో వాహనాలను కిందికొండ భోగమహేశ్వరం వద్దనే నిలిపివేశారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను కొండపైకి తరలించారు. కొంతమంది భక్తులు మెట్లదారి గుండా కాలినడకన వెళ్లి స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆయల కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్, కార్య నిర్వహణ కార్యదర్శి శ్రీనివాసరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, 12 మంది ఎస్ఐలు, 120 మంది పోలీస్ సిబ్బందిని నియమించారు.

వరిలో జింకు లోపం నివారణ

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్



వరిలో జింక్ లోపం

అలంపూర్: నీటి వసతి ఉన్న రైతులు యాసంగి సీజన్‌లో వరి పంట సాగు చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలోని నేలల్లో జింకు ధాతువు లోపం గుర్తించినట్లు ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు తెలిపారు. 25 ఏళ్లుగా అధిక దిగుబడులు ఇచ్చే రకాలు సాగు చేయడం, సంవత్సరానికి రెండు పంటలు పండించడం, కేవలం నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను వాడటం వలన జింకు లోపం గమనిస్తున్నట్లు వివరించారు.

జింకు ధాతువు ప్రాముఖ్యత

- మొక్కలలో మాంసకృతులు, అమినో ఆమ్లాల తయారీకి నత్రజని, భాస్వర పోషకాల సమర్థ వినియోగానికి ఇది తోడ్పడుతుంది.
- మొక్క పెరుగుదలకు కావాల్సిన ఇండోల్ అసిటిక్ ఆమ్లం ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తోంది.
- పత్ర హరితంలో జింకు ముఖ్యధాతువుగా, కిరణ జన్య సంయోగ క్రియకు తద్వార ఆహార తయారీకి ఉపయోగపడుతుంది.

జింకులోపానికి ప్రధాన కారణాలు

- సేంద్రియ ఎరువులను తగినంత మోతాదులో వాడకపోవడం.
- భూమిలో క్షారగుణం, సున్నపు పాల్లు ఎక్కువగా ఉండటం.
- సంవత్సరం పొడవున ఎక్కువ కాలం నీరు నిల్వ ఉంటూ మురుగు పోకుండా ఉండటం.
- వరి పంటనే ప్రతి సంవత్సరం వేయటం.
- ఉదజని సూచిక 8.0 కంటే ఎక్కువగా ఉండటం.
- కొత్తగా అచ్చుకట్టిన పొలాల్లో ఈ ధాతువు లోపం కనిపిస్తోంది.
- సమస్యాత్మక నేలలను బాగు పరిచే క్రమంలో నేలల్లో ఒక్కో సారి సున్నం ఎక్కువై జింకు లోపం కనిపిస్తోంది.

వరిలో జింకులోప లక్షణాలు

- నారు మళ్లలో కాని నాటు వేసిన 2 నుంచి 6 వారాల వరకు కనిపిస్తోంది.
- లోప లక్షణాలు ఎక్కువగా పల్లపు ప్రాంతాల్లో కనిపిస్తోంది.
- వరి మొక్కలలో పై నుంచి 3 లేదా 4వ ఆకు మధ్య ఈనె ఆకుపచ్చ రంగు కోల్పోయి పసుపు రంగుకు మారుతాయి.
- ఆకు చివరలో మధ్య ఈనెకు ఇరువైపులా తుప్పు లేదా ఇటుక రంగు మచ్చలు ఏర్పడి తర్వాత ఆకులన్నీ రాలిపోతాయి.

జింకు లోప నివారణకు చర్యలు

- వరి నాటే ముందు ఆఖరి దుక్కిలో ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్ (21 శాతం) వేసుకోవాలి.
- నాట్లు వేసిన తర్వాత 2 నుంచి 5 వారాల మధ్య జింకు లోపం కనిపిస్తే పొలంలోని పాత నీటిని తీసి కొత్త నీటిని పెట్టాలి. ఈ చర్య వలన ఉదజని సూచిక 7కు తగ్గి జింక్ లభ్యత పెరుగుతుంది.
- పైరులోపల లక్షణాలు కనిపించినప్పుడు రెండు గ్రాములు చీలేటెడ్ జింక్‌ను లీటర్ నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి.

జింక్ వాడకంలో మెళకువలు

- పచ్చి రొట్టెతో పాటు జింక్ సల్ఫేట్ లభ్యత మరింతగా పెరుగుతుంది.
- భాస్వరం ఎరువుల వాడకానికి జింక్ సల్ఫేట్ వాడకానికి మధ్య కనీసం 3 నుంచి 4 రోజుల వ్యవధి అవసరం.
- జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పురుగు లేదా తెగులు మందులతో కలిపి పిచికారి చేయరాదు.

వైభవంగా దత్తాత్రేయస్వామి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

మక్తల్: మండలంలోని పస్పుల గ్రామ కృష్ణానది ఒడ్డున ఉన్న వల్లభాపురం దత్తాత్రేయస్వామి రథోత్సవం శుక్రవారం సాయంత్రం వైభవంగా జరిగింది. అందంగా ముస్తాబు చేసిన స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి పల్లకీలో తీసుకొచ్చి రంగురంగుల పూలతో అలంకరించిన రథంపై ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు రథాన్ని ముందుకు లాగారు. ఈసారి రథోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వనజ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీలు కొండయ్య, గడ్డంపల్లి హన్మంతు, ఆలయ చైర్మన్ దత్తు, సర్వేశ్వరానందస్వామి, సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు రాజుల ఆశిరెడ్డి, కార్యదర్శి రామలింగారెడ్డి, మక్తల్ ఎస్ఐ లక్ష్మారెడ్డి, చక్రధర్, లక్ష్మణ్, నాగేష్, ప్రహ్లాద్‌రెడ్డి, మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాల స్థావరాలపై దాడులు

భూత్పూర్: మండలంలోని పాత మొల్గర గ్రామ శివారులో శుక్రవారం కోడిపందాలు ఆడుతున్న స్థావరంపై దాడి చేసి 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. పాత మొల్గర గ్రామ శివారులో కోడి పందాలు ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు భూత్పూర్ ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో కోడి పందాలు ఆడుతున్న 10 మందితోపాటు 7 బైకులు, 5 పందెం కోళ్లు, రూ.1,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. కోడి పందాలు ఆడుతున్న 10 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాగునీటికి రైతుల తిప్పలు

• సొంత ఖర్చులతో కట్టకు మట్టి



అశ్వరావుపల్లి ప్రధాన కాలువ నీరు నెల్లుట్ల చెరువులోకి వెళ్లకుండా సైఫన్ వద్ద మట్టిని పోస్తున్న రైతులు

లింగాలఘణపురం: జనగామ జిల్లా లింగాల ఘణపురం మండల పరిధిలోని నాగారం, లింగాల ఘణపురం రైతులు ఎండుతున్న యాసంగి పంటలను కాపాడుకునేందుకు తిప్పలు పడుతున్నారు. అశ్వరావుపల్లి రిజర్వాయర్ ప్రధాన కాలువ పూర్తి కావడంతో అధికారులు నీటిని వదిలారు. అయితే నెల్లుట్ల చెరువు వద్ద సైఫన్ నుంచి నీరు వచ్చే చోట సంబంధిత కాంట్రాక్టర్ మట్టిని సరిగా పోయలేదు. దీంతో కట్ట తెగిపోవడంతో అధికారులు నీటిని ఆపేశారు. బిల్లులు రాలేదంటూ కాంట్రాక్టర్ పట్టించుకోలేదు. దీంతో రైతులే స్వయంగా ట్రాక్టర్లతో మట్టి తీసుకొచ్చి పోస్తూ.. కట్టను మరమ్మతు చేసుకుంటున్నారు. ఈ కాల్వకు నీరు వస్తే లింగాలఘణపురం, నాగారం, క్లైం, సిరిపురం, మాణిక్యాపురం, జీడికల్ గ్రామాల రైతులకు మేలు జరుగుతుంది.

ఎస్సీ వర్గీకరణే మా అంతిమ లక్ష్యం

• ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



కరీంనగర్: ఎస్సీ వర్గీకరణే ఎమ్మార్పీఎస్ అంతిమ లక్ష్యమని, 29 ఏళ్లగా సాగుతున్న తమ పోరాటం చివరి దశకు చేరుకుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం ఆయన కరీంనగర్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల పార్లమెంటరీ నియోజకవర్గస్థాయి సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అంశానికి మద్దతు ఇస్తున్న పార్టీని ఎమ్మార్పీఎస్ గెలిపించాల్సిన ఆవశ్యకత ఉందని, ఉద్యమ లక్ష్యం త్వరలో సాకారం కానుందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ, బీజేపీ అగ్ర నేతలు ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా ఉండటమే కాకుండా చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నారని వివరించారు.

వైఎస్ విజన్ వల్లే హైదరాబాద్ అభివృద్ధి

• అంతర్జాతీయ విమానాశ్రయం, ఓఆర్ఆర్, పీవీ ఎక్స్‌ప్రెస్ వే వంటి ప్రాజెక్టులతో నగర రూపురేఖలు మార్చారు
• అప్పుడు పుంజుకున్న స్థిరాస్తి మార్కెట్ ఇప్పటివరకూ కొనసాగుతూనే ఉంది
• క్రెడాయ్ 13వ ప్రాపర్టీ షో ప్రారంభోత్సవంలో మంత్రి పొంగులేటి



క్రెడాయ్ ప్రాపర్టీ షోలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి విజన్, విధానాల వల్లే హైదరాబాద్ అభివృద్ధి సాధ్యమైందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ అధికారంలోకి రాక ముందు హైదరాబాద్‌లో స్థిరాస్తి మార్కెట్ పూర్తిగా క్షీణ దశలో ఉండేదని, ఆయన సీఎం పదవి చేపట్టాక దూరదృష్టితో నగరాభివృద్ధి కోసం చేపట్టిన అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్‌రోడ్డు, పీవీ ఎక్స్‌ప్రెస్ వే వంటి విప్లవాత్మక ప్రాజెక్టులతో హైదరాబాద్ రూపురేఖలే పూర్తిగా మారిపోయాయని గుర్తుచేశారు. దీంతో అప్పుడు పుంజుకున్న స్థిరాస్తి మార్కెట్ ఇప్పటివరకూ కొనసాగుతూనే ఉందని చెప్పారు. భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) హైదరాబాద్ 13వ ప్రాపర్టీ షో మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిలో బిల్డర్లు కూడా భాగస్వాములేనన్నారు. బిల్డర్లు ఎంత వ్యాపారం చేస్తే రాష్ట్రం అంత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. బిల్డర్లను వ్యాపారస్తులుగా చూసే విధానాలకు స్వస్తిచెప్పి పరిశ్రమ అభివృద్ధి కోసం నిర్ణయాలు తీసుకుంటామని పొంగులేటి హామీ ఇచ్చారు. శివారు ప్రాంతాల్లోని రిజర్వాయర్ల సామర్థ్యాన్ని మరింత పెంచి హైదరాబాద్ దాహార్తిని తీరుస్తామని, నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. నిర్మాణ అనుమతులన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. హైదరాబాద్ నలువైపులా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తుందని పేర్కొన్నారు.

ధరణిలో 8.5 లక్షల దరఖాస్తులు పెండింగ్..

ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వం ఎన్నో విధ్వంసాలకు పాల్పడిందని, సామాన్యులకు కలిగిన ఇబ్బందులను కళ్లారా చూస్తున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు. ప్రస్తుతం ధరణిలో 8.5–9 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిలో 5.8 లక్షల దరఖాస్తులను సహేతుక కారణాల్లేకుండానే తిరస్కరించారని విమర్శించారు. స్పెషల్ డ్రైవ్‌లతో గత వారం రోజులలో 80 వేల పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామని పొంగులేటి చెప్పారు. రిజిస్ట్రేషన్ల శాఖను ప్రక్షాళన చేసి బలోపేతం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఉన్న లొసుగులను గుర్తించి సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరిస్తామన్నారు. పారదర్శక రెవెన్యూ వ్యవస్థను సామాన్యుల చెంతకు తీసుకురావాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వైఎస్సార్ లాగా ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని భువనగిరి కాంగ్రెస్ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్, మెట్రో విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్లతో ప్రధాన నగరంలో కూడా అభివృద్ధి పరుగులు పెడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ జాతీయ మాజీ అధ్యక్షుడు సి.శేఖర్‌రెడ్డి, క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి. రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద మృతి



సాహిత్య (ఫైల్)

హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని తల్లిదండ్రుల ఆరోపణ

• కళాశాల ఎదుట బంధువుల ఆందోళన
• మృతదేహం వద్ద సూసైడ్ నోట్ లభ్యం
• హనుమకొండలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఘటన

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి పరిధి భీమారంలోని ఓ ప్రైవేట్ కాలేజీకి చెందిన హాస్టల్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. అయితే తమ కూతురును హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తూ తల్లిదండ్రులు, బంధువులు కాలేజీ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం గట్ల కనపర్తికి చెందిన వలుగుల ప్రభాకర్, కవిత దంపతుల పెద్దకూతురు సాహిత్య (17) భీమారంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఆమె అదే కళాశాల హాస్టల్‌లోనే ఉంటోంది. ఇటీవల ఇంటర్ పరీక్షలు ప్రారంభం కావడంతో గత సబ్జెక్టుల్లో సాహిత్య అనుకున్నంత మేరకు పరీక్షలు రాయలేదు. దీంతో సాహిత్య మానసిక వేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె వద్ద లభ్యమైన సూసైడ్ నోట్ ద్వారా తెలుస్తోంది.

భవనంపై నుంచి దూకి..?

సాహిత్య, కళాశాల హాస్టల్ భవనం పైనుంచి శుక్రవారం తెల్లవారు జామున దూకి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం సాహిత్య కింద పడి ఉండటం గమనించిన కళాశాల యాజమాన్యం హుటాహుటిన ఆమెను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. అక్కడినుంచి ఎంజీఎంకు తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు.

సూసైడ్ నోట్ లభ్యం..

ఇదిలా ఉండగా సాహిత్య రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'జువాలజీ పరీక్ష రోజు చనిపోతున్నా'అని అందులో పేర్కొంది. అయితే పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆ సూసైడ్ నోట్ తన కూతురిది కాదని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. తమ కూతురును హత్య చేసి.. ఆత్మహత్య చేసుకున్నట్లు సూసైడ్ నోట్ రాసి పెట్టారని తెలిపారు. భవనంపై నుంచి దూకితే చేతిపై బ్లేడ్‌తో కోసిన గాయాలు ఎలా అయ్యాయని ప్రశ్నించారు. తమ కూతురు మృతదేహాన్ని గోప్యంగా ఎందుకు ఎంజీఎంకు తరలించారన్నారు.

కళాశాల ఎదుట ఆందోళన

తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. సుమారు నాలుగు గంటల పాటు ఈ ఆందోళన కొనసాగింది. వారి ఆందోళనకు విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ సంజీవ, ఎస్సైలు రాజ్‌కుమార్, సురేశ్‌లు ఆందోళనకారులను శాంతింపజేశారు. సాహిత్య మరణంపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సంజీవ తెలిపారు. కళాశాలలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అలాగే సూసైడ్ నోట్‌ను ఫోరెన్సిక్స్ పరీక్షలకు పంపించనున్నట్లు చెప్పారు.

నేత్ర దానం

సాహిత్య నేత్రాలు దానం చేశారు. తల్లిదండ్రుల కోరిక మేరకు ప్రాంతీయ నేత్ర వైద్యశాల, వరంగల్ సిబ్బంది నేత్రాలు సేకరించారు.

పుణ్య స్నానానికి వచ్చి అనంతలోకాలకు..

ఎస్సారెస్పీలో మునిగి ముగ్గురు యువకుల మృతి



సాయికిరణ్ (ఫైల్)



సాయినాథ్ (ఫైల్)



లోకేశ్ (ఫైల్)

బాల్కొండ: శివరాత్రి పర్వదినం సందర్భంగా పుణ్య స్నానాల కోసం వచ్చిన ముగ్గురు యువకులు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటిలో మునిగి మృతి చెందారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం గన్యా తండాకు చెందిన అజ్మీరా సాయి కిరణ్ అలియాస్ మున్నా (17), అజ్మీరా సాయినాథ్ (16), బానవత్ లోకేశ్ (16)లతో పాటు వంశీ, సందీప్, అభిరాం శుక్రవారం ఉదయం ప్రాజెక్టుకు వచ్చారు. తొలుత మిత్రులందరూ రిజర్వాయర్‌లో స్నానం చేసి ఒడ్డుకు చేరారు. అయితే మట్టి అంటుకుందని మళ్లీ స్నానం చేసేందుకు సాయి కిరణ్, సాయినాథ్, లోకేశ్‌లు లక్ష్మీ కాలువ హెడ్‌రెగ్యులేటర్ సమీపంలో గల నీటిలో దిగారు. అయితే అక్కడ లోతు ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగి పోయారు. ఒడ్డున ఉన్న వంశీ వాళ్లను కాపాడేందుకు నీటిలోకి దిగినప్పటికీ అతను కూడ మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో అప్రమత్తమై అక్కడ ఉన్న సిమెంట్ కట్టడాన్ని పట్టుకుని బయట పడ్డాడు. ఆందోళనతో మిగతా మిత్రులు తమ కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ విషయం తెలియగానే ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి సిబ్బందితో వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలు రిజర్వాయర్ నుంచి కాలువలోకి కొట్టుకుపోకుండా ఉండేందుకు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి లక్ష్మీ కాలువకు నీటిని నిలిపివేయించారు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను వెలికితీశారు. సాయినాథ్, లోకేశ్‌లు ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా సాయి కిరణ్ లారీపై దినసరి కూలీగా ఉన్నాడు. ఘటనా స్థలానికి గన్యా తండా వాసులు భారీగా చేరుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఘటనా స్థలాన్ని ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

యాదాద్రికి అఖండ జ్యోతి యాత్ర



బర్కత్‌పురలో ప్రారంభమైన అఖండ జ్యోతి యాత్రలో ప్రభుత్వ విప్ ఐలయ్య, ఈవో, అనువంశిక ధర్మకర్త, ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని బర్కత్‌పురలోగల యాదగిరి భవన్ నుంచి యాదాద్రికి అఖండ జ్యోతి యాత్ర ప్రారంభమైంది. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఆలయ ఈవో రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి శుక్రవారం ఈ యాత్రను ప్రారంభించారు. శ్రీస్వామి అమ్మవార్ల విగ్రహం ముందు ఆచార్యులు భారీ అఖండ దీపాన్ని వెలిగించారు. అఖండ జ్యోతి యాత్ర ఉప్పల్, ఘట్‌కేసర్, భువనగిరి మీదుగా యాదగిరిగుట్ట పట్టణానికి ఈ నెల 11న చేరుకుంటుంది.

భర్త వేధింపుల నుంచి రక్షించండి

మంత్రి కాళ్లు మొక్కిన మహిళ



రోదిస్తూ న్యాయం చేయాలని మంత్రిని వేడుకుంటున్న వివాహిత

ఎంజీఎం (వరంగల్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళలంతా సంబరాల్లో మునిగిన వేళ...ఓ మహిళ మాత్రం తన భర్త వేధింపుల నుంచి రక్షించాలంటూ రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కాళ్లపై పడి వేడుకుంది. హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన ఓ వివాహిత తన భర్త చేసిన దాడితో రెండు చేతులకు తీవ్ర గాయాలపాలై వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రిలో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి సురేఖ పాల్గొని తిరిగి వెళ్తున్న క్రమంలో సదరు మహిళ మంత్రి కాళ్లపై పడి వేడుకుంది. తన భర్త తీవ్రంగా హింసిస్తున్నాడని, పోలీస్‌స్టేషన్‌కు ఎన్నిసార్లు వెళ్లినా తనకు న్యాయం జరగడం లేదని వాపోయింది. రెండు చేతులపై గాయాలతో ఉన్న ఆమెను చూసి మంత్రి సురేఖ చలించిపోయారు. మహిళ పూర్తి వివరాలు తెలుసుకుని పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి ఆమెకు న్యాయం చేయాలని ఆదేశించారు.

పాములు పట్టే వ్యక్తి పాముకాటుకు గురై మృతి



దొబ్బలయ్య (ఫైల్)

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన ఎరుకలి దొబ్బలయ్య (58) పాములు పట్టేవాడు. శుక్రవారం తన ఇంట్లో పాము కాటుకు గురై మృతిచెందాడు. గ్రామస్తుల కథ నం మేరకు.. చిన్నంబావి, పాన్‌గల్ మండలాల్లోని గ్రామాల్లో ఎక్కడైనా విష సర్పాలు కనిపిస్తే దొబ్బలయ్య పట్టుకొని రెండు, మూ డురోజులు ఆడించి ఆర్థికంగా కొంత డబ్బు పోగు చేసుకునేవాడు. పేదరికంలో ఉన్న వీరి కుటుంబానికి ఈ డబ్బు ఎంతో ఆసరాగా ఉండేది. వారం క్రితం పక్క గ్రామంలో పట్టుకొచ్చిన నాగుపామును ఇంట్లో ఒక కుండలో భద్రపర్చాడు. శుక్రవారం బయటకు తీస్తుండ గా పాముకాటుకు గురయ్యాడు. స్థానిక ఆస్ప త్రిలో చికిత్స అందించి జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దొబ్బలయ్యకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

గద్వాల క్రైం: రైలు కిందపడి ఓ యువకుడు శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపారు. గద్వాల మండలం మేళ్లచెరువుకు చెందిన బోయ రవి (25) ఏడేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు వైద్యులకు చూపించినప్పటికి ఎలాంటి ఫలితం లేకపోయింది. శుక్రవారం తెల్లవారుజామున గద్వాల నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న గూడ్స్‌రైలు కిందపడి మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కానిస్టేబుల్ వివరించారు.

చిన్నారుల అపహరణకు యత్నం

నాగర్‌కర్నూల్ క్రైం: ఆటోలో వచ్చి చిన్నారులను అపహరించుకెళ్లేందుకు యత్నించిన ఘటన జిల్లాకేంద్రంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇద్దరు చిన్నారులను ఆటోలో ఎక్కించుకోగా గమనించిన గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో చిన్నారులను అక్కడే వదిలేసి గుర్తుతెలియని వ్యక్తులు పరారయ్యారు. చిన్నారులను గుర్తుతెలియని వ్యక్తులు తీసుకువెళ్లేందుకు ప్రయత్నించినట్లు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ కావడంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ విషయమై ఎస్‌ఐ గోవర్ధన్ స్పందిస్తూ వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు.

గిరిజన బిడ్డలు.. క్రీడల్లో దిట్ట

• బాస్కెట్‌బాల్‌లో అక్కాచెల్లెళ్ల ప్రతిభ
• రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణింపు
• స్పోర్ట్స్ కోటాలో ఇద్దరికి ఉన్నత విద్యలో సీట్లు



ట్రోఫీలతో అక్క, చెల్లెలు జ్యోతి, ప్రియాంక

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాలోని కోయిలకొండ మండలం కేశ్వాపూర్ పెద్దతండాకు చెందిన అక్కాచెల్లెళ్లు కె.జ్యోతి, కే.ప్రియాంక బాస్కెట్‌బాల్‌లో మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నారు. జిల్లా జట్టులో ప్రధాన క్రీడాకారులుగా ఎదిగారు. వీరు కొన్నేళ్ల నుంచి జిల్లా స్టేడియంలో కోచ్ ఎండీ.ఖలీల్ వద్ద బాస్కెట్‌బాల్‌లో శిక్షణ తీసుకొని ప్రస్తుతం స్పోర్ట్స్ కోటాలో ఉన్నత విద్య అభ్యసిస్తూ మేటి క్రీడాకారులుగా ఎదిగారు.

11 సార్లు జాతీయస్థాయి పోటీల్లో

బాస్కెట్‌బాల్‌లో జ్యోతి మెరుగ్గా రాణిస్తుంది. 12 సార్లు జాతీయస్థాయి టోర్నీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించింది. 2015లో పంజాబ్ రాష్ట్రంలో జరిగిన జూనియర్ నేషనల్, వరంగల్‌లో జాతీయ ఆర్‌జీకేఏ బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొంది. 2016లో కర్ణాటకలో జరిగిన యూత్, ఉత్తరప్రదేశ్‌లో జూనియర్ నేషనల్ టోర్నీ, హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ స్టేడియంలో జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించింది. 2018 పంజాబ్ రాష్ట్రం లుథియానా, 2019 ఢిల్లీలో అండర్–19, పంజాబ్ రాష్ట్రం లుథియానాలో జరిగిన సీనియర్ నేషనల్ పోటీల్లో పాల్గొంది. చెన్నైలో 2022లో జరిగిన సీనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ టోర్నీలో రాష్ట్ర మహిళా జట్టుకు జ్యోతి ప్రాతినిథ్యం వహించింది. ఆ టోర్నీలో రాష్ట్ర జట్టు రన్నరప్‌గా నిలిచింది. జ్యోతి ఇప్పటి వరకు 25కుపైగా రాష్ట్రస్థాయి టోర్నీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహించి మెరుగైన ప్రతిభ కనబరుస్తోంది. పది సార్లు జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించింది. బాస్కెట్‌బాల్‌లో విశేష ప్రతిభతో జ్యోతికి చెన్నైలోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కాలేజీలో స్పోర్ట్స్ కోటాలో బీఈ– ఈసీఈ చివరి సంవత్సరం చదువుతోంది. 2021లో అన్న యూనివర్సిటీ తరపున కేరళలో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంది. 2022లో గుజరాత్ భావ్‌నగర్‌లో జరిగిన 36వ జాతీయ క్రీడల్లో రాష్ట్రం నుంచి జ్యోతి ప్రాతినిథ్యం వహించింది. బాస్కెట్‌బాల్ టోర్నీలో తెలంగాణ మహిళా జట్టు స్వర్ణ పతకం సాధించింది.

అంతర్జాతీయస్థాయిలో ఆడాలన్నదే లక్ష్యం..

చిన్నప్పటి నుంచి ఆటలంటే ఎంతో ఇష్టం. బాస్కెట్‌బాల్‌లో అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిథ్యం వహించాలన్నదే లక్ష్యం. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్‌ల శిక్షణలో జాతీయస్థాయికి ఎదిగాం. పట్టుదలతో ఆడి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధిస్తాం.

– జ్యోతి, ప్రియాంక

అక్క బాటలోనే చెల్లి

2014లో ఖమ్మంలో ప్రియాంక తన తొలి రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లాకు ప్రాతినిథ్యం వహించింది. ఇప్పటి వరకు 25కుపైగా రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంది. అక్క జ్యోతితో కలిసి పలు సార్లు రాష్ట్రస్థాయి టోర్నీలో ఆడింది. మూడు సార్లు జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున పాల్గొంది. 2017 ఢిల్లీలో జరిగిన ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించింది. 2018లో ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా నేషనల్ గేమ్స్‌లో బాస్కెట్‌బాల్ అండర్–17 విభాగానికి ఎంపికై ంది. ఉమ్మడి జిల్లా నుంచి బాస్కెట్‌బాల్ క్రీడలో ప్రియాంక చోటు దక్కించుకొని ఢిల్లీలో జరిగిన ఖేలో ఇండియా పోటీల్లో పాల్గొంది. 2019 ఢిల్లీలో జరిగిన అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో ఆడింది. 2021లో ప్రియాంక స్పోర్ట్స్ కోటా సెలక్షన్స్‌లో చెన్నైలోని పడూర్‌లోని హిందూస్థాన్ యూనివర్సిటీలో బీబీఏ చివరి సంవత్సరం చదువుతోంది. హిందూస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తరపున 2023 జనవరిలో తమిళనాడులో సౌత్‌జోన్ నేషనల్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంది. గతేడాది డిసెంబర్‌లో బెంగుళూర్‌లో సౌత్‌జోన్‌లో హిందూస్థాన్ యూనివర్సిటీ మూడోస్థానంలో నిలిచింది. ఈ ఏడాది జనవరిలో హర్యానాలో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనగా హిందూస్థాన్ యూనివర్సిటీ జట్టు నాల్గో స్థానంలో నిలిచింది. ఫిబ్రవరిలో అస్సాం గౌహాటిలో ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో పాల్గొని కాంస్యం పతకం సాధించింది. అదే విధంగా పంజాబ్ రాష్ట్రం లుథియానలో సీనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు తరపున ఆడింది.

శివజ్యోతి దర్శనం.. పూర్వజన్మ సుకృతం



ఆకాశంలోకి ఎగురుతున్న శివజ్యోతిని దర్శించుకుంటున్న భక్తులు

అలంపూర్: బాలబ్రహ్మేశ్వరుడి క్షేత్రమైన అలంపూర్‌లో శుక్రవారం అర్ధరాత్రి మహా శివరాత్రిని పురస్కరించుకొని శివజ్యోతి దర్శన భాగ్యం కలిగింది. ఓం నమః శివాయ అంటూ శివస్వాములు పంచాక్షరి నామస్మరణతో శివజ్యోతిని నింగిలోకి వదిలారు. మనసా.. వాచ.. కర్మణ త్రికరణ శుద్ధితో మండలం పాటు దీక్ష స్వీకరించిన శివస్వాములు అర్ధరాత్రి లింగోద్భవన సమయంలో నింగిలో ఎగిరిన శివజ్యోతి దర్శనాన్ని వీక్షించారు. శివస్వాములు, భక్తులు శివ నామస్మరణలతో శిరస్సుపై జ్యోతిని నిలుపుకొని నగర సంకీర్తనలు చేస్తూ బాణసంచా పేలుస్తూ ఊరేగింపుగా బాలబ్రహ్మేశ్వర ఆలయానికి చేరుకున్నారు. అక్కడ సిద్ధం చేసిన జ్యోతిని నింగిలోకి వదిలారు. జ్యోతి దర్శనం చేసుకున్న శివస్వాములు లింగోద్భావ కాలంలో మాల తీసి దీక్ష విరమణ చేశారు. శివ జ్యోతిని తిలకించడానికి శివస్వాములు, భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆలయం ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది.

ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు

దక్షిణకాశీ అలంపూర్ ఆలయాలను ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్యనాయుడు స్వాగతం పలికారు. అనంతరం ఆయన బాలబ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబ అమ్మవార్ల దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ఆలయాలను దర్శించుకున్న తర్వాత మహాశివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నారు.



బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం చుట్టూ శివజ్యోతి ప్రదక్షిణ

స్నేహితుడి కోసం వెళ్లి.. అనంతలోకాలకు

• ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఆటో
• చికిత్స పొందుతూ ఓ యువకుడి మృతి

ఉండవెల్లి: మిత్రుడిని తీసుకురావడానికి వెళ్లిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. అలంపూర్ చౌరస్తాలోని ఓ జూనియర్ కళాశాలలో గురువారం రాత్రి ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. కార్యక్రమానికి తోటి స్నేహితుడు రాకపోవడంతో చెన్నిపాడుకు చెందిన సాయికుమార్‌ను బైక్‌పై తీసుకురావడానికి భీమవరం గ్రామానికి చెందిన సమీర్(19), కలుగోట్లకు చెందిన చిరంజీవి అనే యువకులు వెళ్లారు. చెన్నిపాడు నుంచి కళాశాల వైపు వస్తున్న సమయంలో చిరంజీవి బైక్‌ను నడుపుతుండగా ఎదురుగా వచ్చిన మానవపాడుకు చెందిన ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సమీర్‌కు తీవ్రగాయాలు స్నేహితులు ఆయన తండ్రికి సమాచారం అందించి అంబులెన్స్‌లో కర్నూలుకు తరలించారు. సమీర్ చికిత్స పొందుతూ గురువారం రాత్రి 11.30 గంటల ప్రాంతంలో మృతిచెందగా.. చిరంజీవి, సాయికుమార్‌లకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటనపై సమీర్ తండ్రి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు.

యువతిపై కత్తితో దాడికి యత్నం

నాగర్‌కర్నూల్ క్రైం: యువతిపై యువకుడు కత్తితో దాడికి యత్నించిన సంఘటన జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం చోటుచేసుకోగా శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. బిజినేపల్లి మండలం నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన అహ్మద్ జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో కత్తితో ఓ యువతిపై దాడి చేసేందుకు ప్రయత్నించగా.. గమనించిన స్థానికులు అడ్డుకుని అహ్మద్‌ను పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ

గోపాల్‌పేట: మహిళ మెడలోంచి బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన ఘటన శుక్రవారం చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని చాకల్‌పల్లికి చెందిన మామిళ్ల యశోదమ్మ శుక్రవారం ఉదయం పొలానికి నడుచుకుంటూ వెళ్తుండగా.. ఎదురుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కేశంపేటకు ఎలా వెళ్లాలంటూ మాటల్లో దింపాడు. అదునుచూసి మెడలో ఉన్న ఐదు తులాల బంగారు గొలుసు తెంపుకొని పరారయ్యారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తి ఎరుపురంగు చొక్కా ధరించాడని, గొలుసు లాగిన వ్యక్తి తెలుపురంగు చొక్కా ధరించాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు. విషయం తెలుసుకున్న వనపర్తి సీఐ నాగభూషణంరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తాలో ఉన్న 100 పడకల ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ తీగలు, నీటి కొళాయి పైపులు, ఆక్సిజన్ పైపులను జనవరిలో దొంగిలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జ్ డా. సయ్యద్ పాషా శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. దొంగిలించిన సామగ్రి విలువ రూ.95 వేలకు పైగా ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.